## అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా ముందస్తు దీపావళి ఉత్సవాలు




కరీంనగర్, జనతా న్యూస్: దీపావళి పండుగ చీకటిపై వెలుగు మరియు చెడుపై మంచి సాధించిన విజయంగా పరిగణిస్తారని దేశవ్యాప్తంగా ఆనంద ఉత్సవాల మధ్య ఈ పండుగను జరుపుకుంటారని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు .స్థానిక కరీంనగర్ లోని వివిధ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి వేడుకలను ఏర్పాటు చేశారు. దీపావళి పండుగ తో సమాజానికి నూతన శోభ వస్తుందని దీపాలతో విరాజిల్లుతుందని, ప్రతి ఒక్కరూ దీపావళి పండుగను పురస్కరించుకొని దీపాలతో చక్కగా అలంకరించాలని గృహాలను దీపాలతో అలంకరించి అష్టైశ్వర్యాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## జిల్లా క్రీడల పోటీలో తోటపల్లి విద్యార్థిని



జనత న్యూస్ బెజ్జంకి : ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్ క్రీడల పోటీలో మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సుధగొని జాగృతి మూడవ స్థానంలో విజయం సాధించి గ్రామానికి రావడంతో శుక్రవారం స్థానిక పాఠశాలలో గ్రామ మాజీ సర్పంచ్ బోయిన్పల్లి నర్సింగారావు ఉపాధ్యాయులతో కలిసి ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసింగారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తనవంతుగా విద్యాపరంగా, క్రీడల పరంగా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాయ మాటలతో అధికార పగ్గాలు

**మాజీ జెడ్పిటిసి కనగండ్ల కవిత తిరుపతి.**



జనత న్యూస్ బెజ్జంకి : న్యాయస్థానాల్లో కొట్టుడు పోతుందని తెలిసి కూడా 42% బీసీ రిజర్వేషన్లు ఇస్తామని, ఆచరణ సాధ్యం కానీ హామీలతో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని బెజ్జంకి మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కనగండ్ల కవిత తిరుపతి శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలతో పాటు, రైతులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. హడావిడిగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మిల్లులు కేటాయించకపోవడంతో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో, రైతుల వ్యవసాయ కల్లాల్లో పోసి ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అవగాహన పెంచుకోండి : కరీంనగర్ సిపి గౌస్ అలామ్**




తిమ్మాపూర్, జనతా న్యూస్ : సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం సూచించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో ఎల్ఎండి పోలీసుల ఆధ్వర్యంలో శుక్ర వారం ఉదయం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. కరీంనగర్ సిపి గౌస్ అలాం, రూరల్ ఏసిపి విజయ్ కుమార్ తో పాటు ఆరుగురు సిఐలు, 13 మంది ఎస్సైలు, 80 మంది పోలీసు సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. కార్డన్ సెర్చ్ లో ఇల్లు ఇల్లు సోదా చేశారు. 117 ద్విచక్ర వాహనాలు, 7 త్రీ వీలర్, ఒకటి ఫోర్ వీలర్ వాహనాలను సీజ్ చేశారు. వాహన పత్రాలను వాటిపై ఉన్న పెండింగ్ ఛానల్ లను పరిశీలించి విడుదల చేశారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ తో కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్ పై గ్రామస్తులకు వీడియో లు చూపిస్తూ పోలీసులు అవగాహన కల్పించారు. అనంతరం కరీంనగర్ సిపి గౌస్ అలాం మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణంతో ప్రాణ నష్టం జరుగుతుందని, అందుకే వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిపి సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదంటే 1930కు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు. ఆలస్యం చేస్తే అకౌంట్లో నుండి డబ్బులు బదిలీ అయ్యే ప్రమాదం ఉందని, వెంటనే స్పందించాలని తెలిపారు. స్మార్ట్ ఫోన్ లో ఫ్రాడ్ లింక్ లు ఓపెన్ చేయొద్దని, అప్ లు డౌన్లోడ్ చేసుకోవద్దని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఇండ్లను అద్దెకు ఇవ్వవద్దని, తప్పకుండా వారి యొక్క ఆధారాలు తీసుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ తీసుకోవద్దని యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సిపి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్, సీఐలు సదన్ కుమార్, కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, సంజీవ్ సరిలాల్, శ్రీలత, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.

# రచ్చ...రచ్చ

## కవ్వంపల్లి Vs రసమయి

**ఇద్దరి మధ్య బూతు పురాణం**

**రసమయి పై కేసు నమోదు**

తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఒకరు సిట్టింగ్ ఎమ్మెల్యే. మరొకరు పదేళ్లపాటు కొనసాగిన మాజీ ఎమ్మెల్యే. ఒకరు వృత్తిరిత్యా డాక్టర్. మరొకరు పీహెచ్డీ పూర్తి చేసి డాక్టర్ అయ్యారు. నలుగురికి మార్గదర్శకులుగా, ఆదర్శంగా ఉండాల్సిన నేతలు నవ్వుల పాలవ్వడమే కాకుండా నియోజకవర్గంలో అభాసుపాలవుతున్నారు. ఇది ఆ ఇద్దరికే పరిమితం కాకుండా మండలాల్లోకి, గ్రామాల్లోకి చేరి రోడ్లపైకి వచ్చే పరిస్థితికి నెలకొంది. మానకొండూర్ నియోజకవర్గంలో రాజకీయం రచ్చ.. రచ్చగా మారింది. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ల మధ్య మాటల యుద్ధం గత కొన్నేళ్లుగా సాగుతోంది. అది రానురాను మితిమీరిపోతుంది. రాజకీయ పరంగా, అభివృద్ధి పరంగా విమర్శలు చేసుకోవాల్సిన నేతలు వ్యక్తిగతంగా దుర్భాషలాడుకుంటున్నారు. ఇంట్లో ఉన్న వారిని, కన్నవారిని సైతం తిట్టుకోవడంతో వినేవారు ముక్కున వేలేసుకునే పరిస్థితి నెలకొంది. దసరా సందర్భంగా నిర్వహించే ఎల్ఎండీ కాలనీలో నిర్వహించే రామలీల కార్యక్రమం విషయంలో ఆరోపణలతో మొదలైన మాటల పర్వం కన్నతల్లిని తిట్టించే స్థాయికి తీసుకొచ్చింది. రామలీల కార్యక్రమానికి వసూళ్ల పర్వం మొదలుపెట్టి రూ. 1.15కోట్లు వసూలు చేశారని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపణలు చేశారు. దీనిపై ఆధారాలు లేకుండా ఎలా రాస్తారు అంటూ, ఆయన ఏది చెబితే అది రాస్తారా.. మీరేమైనా పోస్టుమ్యాన్ జాబ్ చేస్తున్నారా అంటూ గత నెల 28న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే కవ్వంపల్లి విలేకరుల సమావేశంలో ఆవేశపడ్డారు. అంతే కాకుండా పరుషపదజాలాన్ని వాడారు. దీనిని అందులో ఓ విలేకరి రికార్డు చేయడం... అది రసమయికి చేరింది. దసరా తరువాత న్యూజిలాండ్ నుండి స్వదేశానికి వచ్చిన రసమయి ఈ నెల 4న స్పందిస్తూ మీడియా సమావేశంలో మాట్లాడారు. అంతటితో ఆగకుండా... స్టేషన్ లో ఫిర్యాదు చేయకుండా... అదే రోజు రాత్రి రసమయి తన ఫోన్ నుండి వాయిస్ రికార్డును ఎమ్మెల్యే కవ్వంపల్లి ఫోన్ కు వాట్సాప్ ద్వారా పంపడం... అందులో బూతుపురాణం ఉండడం... ఎమ్మెల్యే కవ్వంపల్లి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఈ నెల 14న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పై కేసు నమోదు అయింది. అంతేకాదు అమెరికాలో ఉన్న రసమయి తాను ఎందుకు వాయిస్ ని కవ్వంపల్లికి పంపాడో మరో వీడియోను విడుదల చేశారు. తనను తిట్టిన విషయంలో సైతం తప్పకుండా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై కేసు పెడతానని రసమయి ఇప్పటికే మాటల ద్వారా చెబుతున్నారు.

ఇదిలా ఉంటే కవ్వంపల్లి అనుచరులు తిమ్మాపూర్ క్రాస్ రోడ్డు వద్ద రసమయి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన అనంతరం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారంలోని రసమ-యి ఫామ్ హౌజ్ వద్దకు మరికొందరితో

వెళ్లి రాళ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. సిద్దిపేట జిల్లా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి బెజ్జంకి పోలీస్ స్టేషన్ కి తరలించారు.

మానకొండూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం వారి పరువును దిగజార్చడమే కాకుండా సమాజానికి, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సంకేతాలు పంపుతున్నారని ,నియోజక వర్గ పరువును బజారున పడకుండా ఇకనైనా మానుకోవాలని

ప్రజలు సూచన చేస్తున్నారు.

ఇప్పటికైనా వీరిద్దరు తమ హద్దుల్లో ఉంటూ నియోజకవర్గ ప్రజలకు ఆదర్శంగా ఉండేలా ప్రయత్నం చేస్తారా... మరింత తీవ్రతరం చేసుకుంటూ ప్రజాగ్రహానికి గురవుతారా అనేది వేచి చూడాల్సిందే.

## రసమయి వ్యాఖ్యలకు కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహ జ్వాలలు






**గుండారం ఫామ్ హౌస్ ముట్టడికి యత్నం, అడ్డుకున్న పోలీసులు.**

**రసమయి దిష్టిబొమ్మ దహనం.**

**బెజ్జంకి ఠాణ లో మాజీ ఎమ్మెల్యే పై ఫిర్యాదు**

జనత న్యూస్ బెజ్జంకి : మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పైన, అతని కుటుంబ సభ్యుల పైన చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం గుండారం గ్రామంలో గల రసమయి బాలకిషన్ ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడంతో వారిని పోలీసులు అరెస్టు చేసి బెజ్జంకి పోలీస్ స్టేషన్ కు తరలించడంతో, మండలంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయినా శాంతించని కొందరు కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మ దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు మాట్లాడుతూ రసమయి బాలకిషన్ ప్రజల ముందుకు వచ్చి కవ్వంపెల్లి కి అతని కుటుంబ సభ్యులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి జనగం శంకర్,కాంగ్రెస్ నాయకులు చెప్యాల శ్రీనివాస్ గౌడ్,లింగాల శ్రీనివాస్, శానగొండ శరత్, గూడెల్లి శ్రీకాంత్,భైర సంతోష్, కర్రావుల సందీప్, షాదిక్, పులి సంతోష్, పులి రమేష్ తదితరులు పాల్గొన్నారు.







## అల్ఫోర్స్ టైనీటాట్స్ లో క్రియేటివ్ గెలాక్సీని ఘనంగా ప్రారంభించిన కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





కరీంనగర్,జనతా న్యూస్ : విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి సృజనాత్మకంగా పోటీ తత్వాన్ని పెంపొందించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ పమేలా సత్పతి,అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి గతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో నర్సరీ నుండి రెండో తరగతి విద్యార్థులచే అద్భుతంగా ఏర్పాటు చేసినటువంటి "క్రియేటివ్ గెలాక్సీ" పేరుతో ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చాలా విశ్లేషణాత్మకంగా సమగ్రంగా తెలిపినట్లైతే వారిలో సృజనాత్మకత పెరుగుతుందని మరియు ఆ సుజనాత్మకత ద్వారా నూతన విషయాలను తెలుసుకునేటువంటి అవకాశం ఉంటుందని వారు గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్నటువంటి విషయాలు విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేసినట్లయితే అన్ని రంగాలలో విజయం సాధిస్తారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. తల్లిదండ్రులు సైతం ప్రాథమిక దశ నుండే విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడం ద్వారా చదువు పట్ల ఆసక్తితో పాటు విషయాలు నేర్చుకోవడానికి ఉత్సాహాన్ని చూపుతారని సూచించారు. ప్రదర్శనలో భాగంగా వివిధ తరగతి గదులను వివిధ రకాల వస్తువులతో అలంకరించారు కూరగాయలు కూరలు పెంచే విధానం, ప్రకృతిని కాలుష్యం పొరల నుండి కాపాడడం, వివిధ కులవృత్తులు, జాతీయ పండుగలు, దేశంలోని వివిధ రాష్ట్రాల గురించి వర్ణించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com